# మానవత్వం

సంధ్య వేళ దాటి చీకట్లు కమ్ముకుంటున్నాయి. గోవులు నడిచి వెళ్ళే దారి కావడం వలన సాయంకాలం తుడిచిన గుమ్మాల్లో సన్నగా గోధూళి పేరుకుంది. పిల్లలిద్దరూ వెనక వరండాలో కూర్చుని హోమ్‌వర్కులు చేసుకుంటూ దేనికోసమో కాట్లాడుకుంటున్నారు.

హోమ్‌వర్కు పూర్తి కాగానే 'అమ్మా, అన్నం పెట్టు' అంటూ వస్తారని బియ్యం కడిగి కుంపటి మీద పెట్టింది పార్వతి.

కుంపటి అంటిస్తుంటే గేస్ స్టవ్వు లేదే అని బాధ కలిగింది. అగ్గిపుల్ల గీస్తే చాలు వెలిగే గేస్ స్టవ్వంటే ఎంతో ఇష్టం పార్వతికి.

'అంతంత మాత్రం బతుకులు, కోరుకున్నవన్నీ ఎక్కడ అమరుతాయిలే' అని ఎప్పట్లాగే నిట్టూర్పు విడిచింది.

పిల్లలిద్దరూ ఎనిమిది, ఆరు తరగతులు చదువుతున్నారు. ఇంకా దేనికో దానికి పోట్లాడుకుంటూనే ఉంటారు. పిల్లల్ని చదివిస్తూ ఇంటద్దె కట్టుకుని, ఏం తింటున్నారో ఇతరులకి తెలీకుండా గుట్టుగా కాలం వెళ్లబుచ్చుకొస్తున్నారు.

పార్వతి భర్త రాధాకృష్ణ సినిమాహాల్లో ఆపరేటరు. రెండాట విడిచి పెట్టేక రాత్రి పన్నెండు దాటేక ఇంటికొస్తాడు. 'ఇంకా నయం, ఎలాంటి పాడు అలవాట్లూ లేనివాడు కాబట్టి హాలు వాళ్లిచ్చిన జీతం రాళ్లు తెచ్చి నా చేతిలో పోస్తాడు. అందుకే ఈ మాత్రమైనా హాయిగా బతకగలుగుతున్నాం' అని ఆనందిస్తూ ఉంటుంది పార్వతి.

పవరు కట్టైంది. చటుక్కున దీపాలారిపోయాయి.

"బాగా అయ్యింది బాగా అయ్యింది" అని చప్పట్లు కొడుతున్నాడు బాబిగాడు.

"నీకు మాత్రం, నువ్వింకా రెండు లెక్కలు చెయ్యలేదుగా, నీకూ బాగానే అయ్యిందిలే" ఉక్రోషంగా అంటోంది కాంతి.

"నువ్వు వాడి కన్నా పెద్దదానివన్నమాటే గానీ చిన్నపిల్ల కన్నా అధ్వాన్నం

అయిపోతున్నావే కాంతీ" అని కోప్పడింది పార్వతి. "మీరు కూర్చున్న అరుగు పక్కన బల్ల కింద దీపం బుడ్లు ఉన్నాయి. చెరోటీ పట్టండర్రా, శుక్రవారం పొద్దు ఇల్లు చీకటిగా ఉండకూడదు" అని, జాగ్రత్త చిమ్నీలు పగలగొట్టకుండా తెండి" అంది.

"బాబోయ్, ఈ చీకట్లో ఎక్కడున్నాయో కనపడవు" అని ఒకేసారి సమాధానం చెప్పేరు.

"ఇలాంటి విషయాల్లో మాత్రం ఏకతాటి మీద నిలుస్తారు. మీరు పిల్లలు కారే, నా పాలిటికి–" అని సణుక్కుంటూ లేచింది పార్వతి. దీపాలు వెలిగించి, ఒకటి పిల్లల దగ్గర పెట్టి, మరోటి వీధి గుమ్మంలో పెట్టి వెను తిరగబోతూ అరుగు కింద మెట్లకి చేరబడి ఎవరో కూచున్నట్టనిపించి గతుక్కుమంది. సమయానికి పక్క వాళ్లు కూడా ఊళ్ళో లేరు.

"ఎవరు?... ఎవరది...?...." గొంతు వణుకుతున్నా గట్టిగానే అరిచింది.

"నేనే...నేనే.." అంటోందా ఆకారం నూతిలోంచి మాటాడినట్టు. ఎవరైతే మాత్రం ఎత్తుకుపోవడానికి తమ ఇంట్లో ఏమున్నాయిలే అన్పించి, దీపం చేతిలోకి తీసుకుని ముందుకి నడిచింది పార్వతి. తల్లి అరుపులకి పిల్లలిద్దరూ వీధిలోకి వచ్చేరు. అరుగు మీంచి వంగి దీపం వెలుగులో చూసింది.

అట్టలు కట్టిన తెల్లని జుట్టు, లోతుకు పీక్కుపోయిన కళ్లు, చెంపలు; చిరిగిన చీర కొంగు భుజం మీద కప్పుకుని, ఆ ఆకారం మిణుకు మిణుకుమనే కళ్లల్లోంచి దీనంగా పార్వతి వేపు చూస్తోంది.

"ఇంకా గుర్తుకు రాలేదటే పార్వతీ..." మాట విని చటుక్కున పోల్చుకుంది.

"జానకత్తా...?"

అవునన్నట్టు తల ఊపుతోందావిడ, ఆ కళ్లల్లోంచి జలజలా నీటిచుక్కలు రాలిపడ్డాయి.

జానకమ్మని ఆ స్థితిలో చూసి హతాశురాలై చతికిలబడిపోయింది పార్వతి.

ఇలాంటి పరిస్థితిలో ఆవిడ తన ఇంటికొస్తుందని తను కలలో కూడా

ఊహించని విషయం.

తల్లి ఆవిడని 'అత్తా' అని పిలవడం చూసి కాంతి లోపలికి పరుగెత్తుకెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి చేతికిచ్చింది. ఆవిడ పాపవేపు కృతజ్ఞతగా చూసి గ్లాసుడు నీళ్లూ గటగటా తాగేసింది.

పార్వతికి తన ముందున్న ఆకారం జానకత్త అంటే నమ్మబుద్ధి కావడం లేదు.

ఎంత అహంభావం, ఎంతటి భేషజం, దిగేసుకున్న నగల మరుగున దాక్కునే ఎంతటి అందం, ఎంత దర్పం! అవన్నీ ఏమై పోయాయి? తన తండ్రి ఉన్నదంతా ఊడ్చిపెట్టి చెల్లెల్ని కలిమింటి కోడల్ని చేశాడట. ఆ తర్వాత పుట్టింటి పేదరికం కంటగింపైందీవిడకి. పుట్టింటి వేపు ఎప్పుడూ ఒంగీ తొంగీ చూసేది కాదు. చెల్లెల్ని చూడాలని ఎంతో ఆశగా వెళ్లిన తండ్రి ఇంటికొచ్చి ఎంతో దుఃఖపడడం ఎన్నిసార్లో గమనించింది తను.

చిన్నప్పుడంతా తనని అందరూ జానకత్తలా ఉంటుంది అనేవారు.

అందుకే తండ్రి అమాయకంగా తనని జానకత్త కోడల్ని చేయాలని కలలు కన్నాడు.

జానకత్త భర్త వంద ఎకరాల వ్యవసాయమే కాకుండా ఏవేవో వ్యాపారాలు కూడా చేస్తాడని చెప్పుకొనేవారు.

వాళ్లకి ఒక్కడే కొడుకు సారథి. అతనికి చదువు అంటక మాన్పించి వ్యాపారంలో పెట్టేరని తన తండ్రి అంటూంటే విన్నదోసారి.

సారథి బావని చూడకపోయినా, అతను తన కలల రాజకుమారుడయ్యేడు. అతన్ని ఊహించుకుంటూ ఎన్నో గాలిమేడలు కట్టుకునేది. పదిహేనేళ్ల క్రితం తన తల్లీతండ్రీ జానకత్త ఇంటినించి అవమానంతో తిరిగి రావడం నిన్నో మొన్నో జరిగినంత స్పష్టంగా గుర్తుంది.

"నీ బడిపంతులు ఉద్యోగంతో ఎలా పెళ్లిళ్లు చేద్దామని ముగ్గురు కూతుళ్లని కన్నావురా అన్నయ్యా" అని హాస్యమాడిందట జానకత్త.

"పెద్ద పరుగులు పెట్టి బోర్లా పడే బదులు గంతలకి తగ్గ బొంతల్ని వెతుక్కోవడం

మేలు" అని సలహా ఇచ్చిందట."కావాలంటే పదో పరకో సాయం చెయ్యమని మీ బావగారితో చెప్తానులే" అని జాలి చూపిందంట.

చివరికి ఆవిడన్నట్టే తమ ముగ్గురికీ గంతకి తగ్గ బొంత సంబంధాలే చూసి ముడిపెట్టేరు.

పదేళ్ళ క్రితం ఈవిడ భర్త పోయినప్పుడు"సుఖాల్లో కాకపోయినా కష్టాల్లో ఒకరికొకరు తోడుండాలి" అంటూ తన తండ్రి ఇంట్లో వాళ్ళందర్నీ తీసుకెళ్ళేడు.

మోచేతుల్దాకా బంగారు గాజులేసుకుని, పూటకో జరీ చీర మార్చుతూ ఈవిడ మహారాణి దర్జా ఒలకబోస్తూ తమని పనివాళ్ళ కన్నా హీనంగా చూస్తే, తామేమో వచ్చీపోయే వాళ్లందరికీ వండి వడ్డించి నడుములు విరిగేలా సతమతమయ్యేరు.

ఏనాడూ ఎవరికీ'నా అన్నా వదినలు, నా మేనకోడళ్లు' అని పరిచయం చెయ్యలేదీవిడ, తిరిగొచ్చేసే రోజు తన తండ్రి దుఃఖం పట్టలేక 'జానకీ' అంటూ చెల్లెల్ని పట్టుకుని భోరుమన్నాడు. దానికీవిడ కొంత చికాకుని మొహం లోకి తెచ్చుకుని"బయల్దేరండి, బండెళ్లిపోతుంది" అంది.

అప్పటి ఆ సంఘటనలు, ఆనాటి ఈవిడ ముఖకవళికలూ నిన్నో మొన్నో జరిగినంత స్పష్టంగా పార్వతికి కళ్లకి కదుతున్నాయి.

కుంపటి మీద అన్నం పొంగినట్టుంది. సుయ్యి సుయ్యి మంటూ నిప్పులు ఆరిపోతున్న శబ్దం.

"అయ్యో అమ్మా, అన్నం" అంటూ కాంతి తల్లి చేతిలో దీపం లాక్కుని పరుగెత్తింది.

లేచి నుంచుని అయిష్టంగానే జానకమ్మకి చెయ్యి అందించింది పార్వతి. ఆ చేతిని అపురూపంగా అందుకుని అతికష్టం మీద లేచి నిలబడి పార్వతి వెంట లోపలికి నడిచింది జానకమ్మ.

కరెంటు వచ్చింది.

పిల్లల్తోబాటు తనకీ వడ్డించిన అన్నాన్ని ఆవురావురుమని తిన్నది జానకమ్మ.

ఎక్కడ పడ్డదో ఏమో ఎడంకాలి మడమమీద గాయం చీము పట్టి కాలు వాచి ఉంది. వెన్నమీగడలు తిన్న ఒళ్ళంతా ఏమైందో ఎముకల మీద చర్మం అతికించినంత బక్కగా ఉంది.

అన్నాలు తిని పిల్లలు నిద్రపోయేరు.

పార్వతి స్నానం చేసి, సాయంకాలం పెరట్లో కోసి మాలకట్టుకున్న జాజిపూలని జడలో పెట్టుకుంటూ గదిలో ఓ మూలన ముడుచుకుని పడుకున్న జానకమ్మని తదేకంగా చూసింది. లేమి మనుషుల్లో ఎలాంటి మార్పుల్ని తెస్తుంది!

వచ్చినప్పట్నుంచి ఆవిడని తను పలకరించలేదని గుర్తుకొచ్చింది. ఏమనుకుందో!

ఏమైనా అనుకోనీ, తనకేం? ఆవిడ ఎప్పుడైనా ఎవరేమనుకుంటారో అని ఆలోచించిందా?

చివరికీ రోజు మాత్రం, ఏం దాచి పెట్టిందని తన దగ్గరకొచ్చింది?

తనకన్నీ తెలుస్తూనే ఉన్నాయి. తండ్రి పోగానే ఈవిడగారి కొడుకు పొలాలన్నీ అమ్మిపడేశాడట. ఊళ్ళో ఎవరో నాటకాలమ్మాయిని తీసుకుని సినిమా తీస్తానని మద్రాసు వెళ్లిపోయేడట.

అప్పట్నుంచి మూణ్ణెల్లకో ఆర్నెల్లకో రావడం, తల్లి ఎంత చెప్తున్నా వినకుండా ఆస్తులూ, వ్యాపారాలూ ఒకటొకటీ అమ్మి పడేసి ఆ డబ్బు పుచ్చుకుని వెళ్లిపోవడం, చివరికి ఆ మధ్యెప్పుడో ఈవిడని కొట్టి ఒంటిమీది బంగారం అంతా ఒల్చుకుపోయేడట. అప్పులవాళ్లొచ్చి ఇల్లు ఖాళీ చేయించేరట. వాడేమయ్యేడో అప్పట్నుంచీ అయిపులేదట.

కూతుళ్లని కన్నావని తన తండ్రిని ఎగతాళి చేసిన ఈవిడగారు కన్న పుత్ర రత్నం ఇంత ఒరగబెట్టేడు. కోపంతో అటు తిరిగిపోయింది పార్వతి. ఒక రాత్రివేళ మెలకువొచ్చి అదాటున లేచి కూర్చుంది పార్వతి.

పిల్లల పక్కన కాళ్లుచాపుకుని పడుకుని గాఢ నిద్రలో ఉన్నాడు రాధాకృష్ణ. అతనికలవాటే అర్ధరాత్రి ఎవర్నీ నిద్ర లేపవద్దనుకుని తనే వడ్డించుకుని తిని

నిద్రపోతాడు.

ఇంకా నయం, తను సారథికి పెళ్లామైంది కాదు. తల్లినే లక్ష్యపెట్టనివాడు తనని లక్ష్యపెట్టేవాడా? భోగభాగ్యాలు లేకపోయినా ఉన్నంతలో ప్రశాంతంగా ఉంది బతుకు. ఇందుకే కాబోలు పెద్దలన్నారు ఏది జరిగినా మనమేలుకే అని.

గదిలో మరో మూల పడుకున్న జానకమ్మ నిద్రపోతోందో మెలకువగా ఉందో కాని అసహనంగా కదులుతోంది. తనకి తెలుసు, తన తండ్రి బతికి ఉంటే ఈవిడ ఇక్కడికి వచ్చేది కాదు. అహంకారంతో బతికిన వాళ్లకి ఆత్మాభిమానమూ ఎక్కువే ఉంటుంది.

'పొద్దుటే ఊళ్లో ఉన్న రూరల్ సెంటర్‌కి తీసుకెళ్లి ఆ కాలుకేదో వైద్యం చేయించి, తగ్గేక పంపించేయాలి. ఈ పీడ నాకెందుకు' అనుకుంది పార్వతి.

మర్నాడు ఆవిడ స్నానం చేస్తూంటే చీరకోసమని ఆవిడ తెచ్చుకున్న సంచి తీసింది పార్వతి.

నలిగి చిల్లులు పడిన ఎప్పటెప్పటివో పాత జరీ చీరలు, ఓ చీర తీసి బాత్‌రూం తలుపు మీద వేస్తూంటే చీర మడతలోంచి మాసిన కాయితం ఒకటి కింద పడింది.

విప్పి చూస్తే, అదెప్పుడో జానకమ్మ పేరుతో వచ్చిన టెలిగ్రామ్, అప్పటికి నెల క్రితం సారథి ఏదో యాక్సిడెంటులో పోయాడని దాని సారాంశం. ఎడ్రస్ తెలీక పోలీసులే ఖననం చేశారట.

చీర చుట్టుకుని నడవలేక అడుగేస్తూ నడిచి బైటికొస్తున్న జానకమ్మను ఒక్కసారిగా వాటేసుకుంది పార్వతి.

"అత్తా! నువ్వూ నాబిడ్డల్లో ఒక బిడ్డవు, మాక్కలిగిందేదో ఇంత తిని ఇక్కడే పడి ఉండు" అంటూ ఏడ్చింది.

*********

స్వాతి (మార్చి 2000)